బూచేపల్లికి రాఖీ కట్టిన ఎమ్మెల్యే టీజేఆర్ సతీమణి



శివప్రసాదరెడ్డికి రాఖీ కడుతున్న వనజ

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సతీమణి వనజ శుక్రవారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి రాఖీ కట్టారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు అందించారు.

బీసీ సంఘ సీమాంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా శివకృష్ణ

చీమకుర్తి: బీసీ సంక్షేమ సంఘ సీమాంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా మూరబోయిన శివకృష్ణను నియమించినట్లు శుక్రవారం మీడియాకు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య రెండు సంవత్సరాల పదవీ కాలంతో తనను నియమించినట్లు ఆయన చెప్పారు. ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని శివకృష్ణ తెలిపారు.

ఓటర్ల రీసర్వే పరిశీలన



సర్వే చేస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

అల్లూరు (కొత్తపట్నం): మండలంలోని అల్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఓటర్ల రీసర్వేని ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి 234, 235 పోలింగ్ బూత్‌లతో ఓటర్ల వివరాలను పరిశీలించారు. తహసీల్దార్ బీవీ రమణారావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ఒంగోలు టౌన్: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన నగరంలోని ఓ లాడ్జిలో శుక్రవారం వెలుగుచూసింది. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన మట్టుపల్లి అజయ్‌కుమార్ (33) బీటెక్ చదివి బెంగళూరులో కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేశాడు. ఉద్యోగం మానేసి కొంతకాలంగా ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డులో గల ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. తెల్లవారుజామున సిబ్బంది తలుపులు తీసి చూడగా మరణించి ఉన్నాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్ల నమోదుపై ఎమ్మెల్యే టీజేఆర్ సమీక్ష



పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల చేర్పులు, మార్పులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పార్టీ నాయకులకు సూచించారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, ప్రధాన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఇన్సూరెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, మన ఊరు–మన ఎమ్మెల్యే, గ్రామాల్లో అభివృద్ధి పనులపై సమీక్షించారు.

అగ్రహారం చెరువుకు సాగర్ నీరు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ఎన్.అగ్రహారం చెరువుకు సాగర్ నీటిని విడుదల చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అగ్రహారం చెరువును ఆయన పరిశీలించారు. చెరువులో నీరు అడుగంటిపోయినందున తాగునీటికి, నిత్యావసరాలకు ఇబ్బందిగా ఉందని కమిషనర్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్.. ఇంజినీరింగ్ అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం 33వ డివిజన్‌లోని శివప్రసాద్‌కాలనీ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. హాజరు రిజిస్టర్‌ను కూడా తనిఖీ చేశారు. పన్నుల వసూళ్లలో వెనుకబడితే సహించేది లేదని హెచ్చరించారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఎస్‌డీజీ సర్వే, పీఎం–జేఏవై సర్వే పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు సర్వేలను త్వరితగతిన పూర్తి చేసి ఎందుకు ఇవ్వలేకపోతున్నారో నివేదిక రూపంలో అందించాలని అడ్మిన్‌లను ఆదేశించారు. సక్రమంగా పని చేయని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంతారెడ్డి, ఎంఈకే మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ నియంతాకుమారి, భాస్కరరెడ్డి

నూతన పెన్షన్ల పంపిణీ



నూతన పెన్షన్లు అందిస్తున్న సర్పంచ్ రవికుమార్‌రెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని చేజర్ల గ్రామంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని స్పష్టం చేశారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

ఒంగోలు అర్బన్: స్థానిక చంద్రయ్యనగర్‌లోని వినాయకుని దేవస్థానం పూజారి కొటారి శ్రీరామమూర్తి కుటుంబానికి సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య ఖర్చులు, కుటుంబ పోషణకు శుక్రవారం ఆర్థికసాయం చేశారు. నిత్యావసర సరుకులు కూడా అందజేశారు. పూజారి భార్య ఉషారాణికి డెంగీ జ్వరంతో మెదడువాపు వచ్చి కాలు, చెయ్యి పడిపోయి కంటి చూపు మందగించింది. కుమారుడు పవన్‌కుమార్ తల నరాల్లో రక్తం గడ్డకట్టి మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు చేయూతనందించారు. 48వ డివిజన్ కార్పొరేటర్ వేమూరి భవాని సహకారంతో రూ.10 వేలు, మరో దాత సునీత ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. హెచ్20 ఫౌండేషన్ అధినేత శ్రీలత కోరాడ సహకారంతో మూడు నెలలకు సరిపడా బియ్యం, సరుకులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

- పాల్గొన్న బాలినేని శచీదేవి



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా పలు దేవాలయాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక లాయర్‌పేట షిర్డీ సాయిబాబా మందిరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కి వెండితో చేసిన చీర, ఆభరణాలు అలంకరించి భక్తులకు మంగళహారతి, అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉపాలయంగా ఉన్న రాజ్యలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చనలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి పాల్గొని అర్చక స్వాముల ఆశీర్వచనం తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నాగులుప్పలపాడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వారా వీర్రాజు ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ట్యాబ్ బహూకరణ

ఒంగోలు: స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ నిర్వహించిన పాల్ ల్యాబ్ వర్క్‌షాప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి డీఈవో సుబ్బారావు, సమగ్రశిక్ష ఏపీవో మాధవీలత ట్యాబ్ బహూకరించారు. మొగళ్లూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పి.నాగార్జున ట్యాబ్ అందుకున్నారు.